



చంద్రుడిమీద నడవగల్గడం పెద్ద ఆశ్చర్యమేం కాదు. ఆర్మ్‌స్ట్రాంగ్‌ని వచ్చి గాలిదేవరపాలెం రోడ్లమీద నడవమనండి చూద్దాం!

మనిషి చంద్రుడిమీద నడవగల్గిన విజ్ఞానాన్ని సాధించినా, గాలిదేవరపాలెంలో రోడ్లు అంత నికృష్టంగా ఉన్నాయా? అని అడగొచ్చు. అమెరికాలో విజ్ఞానానికి గాలిదేవరపాలెం బాగోగులికి అస్సలు సంబంధంలేదు.

ఆ వూళ్లో కోట్లకు పడగలెత్తినవాళ్లు ఉన్నారు. కూటికి అంగలార్చేవాళ్లూ ఉన్నారు. అలానే అతివృష్టి, అనావృష్టి ఆ వూరికి కొత్తేమీకాదు. వర్షంపడి వారం రోజు లయింది; రోడ్లమీద మట్టి కొట్టుకుపోయి కంకరరాళ్లు మిగిలాయి. ఎండలు మొదలెట్టాయి. ఇక ఆ రోడ్ల తీరు చంద్రోపరితలంకన్నా అన్యాయం. ఆ వూరి సౌభాగ్యాన్ని ప్రజల అభ్యుదయాన్ని వర్ణించడానికి ఉదాహరణగా ఈ రోడ్డొక్కటేచాలదూ? రోడ్లమీదే వూరి సంగతి తెలిసిపోయింది గనక వూళ్లో దాకా వెళ్లొద్దు...

పిల్లలు గుంపులు గుంపులుగా బళ్లోకి వెళ్తున్నారు.

పుస్తకాల సంచులు భుజాలమీద వేళ్లాడేసుకుని ఉల్లాసంగా నడుస్తున్నారు. ప్రతి పిల్లవాడిచేతిలోనూ ఏదో ఒక ఆట వస్తువు ఉంటూనేవుంది. దానితో ఆడుకుంటూ, మరికొంతమంది పిల్లల్ని ఆ వస్తువుతో ఆకర్షిస్తూ, హాయిగాగెంతుతూ వెళ్తున్నారు. కొందరు పరుగెడుతున్నారు. ఇంకొందరు వాళ్లని పట్టుకోడానికి పరుగెడుతున్నారు. ఎడతెగని కబుర్లు! ఆడుతూ, పాడుతూ ఒకటేగోల! అబ్బ...ఎంతకులాసా? ఎంత ఉత్సాహం!

ఒక కుర్రాడు రోడ్డుమీది కొబ్బరి పుచ్చెని బంతిలాగా తన్నాడు. క్షణంలో 'అమ్మా' అని కాలు పుచ్చుకుని కూలబడిపోయాడు. కూడా వస్తున్న యింకో కుర్రాడు అతని కాలు పట్టుకు చూశాడు. రక్తం! కొబ్బరి పుచ్చెని తన్నడంలో రోడ్డుమీది ఎర్ర కంకర్రాయి కాలికి తగిలింది. దెబ్బ తగిలినవాడు బాధతో ఏడుస్తుంటే—రెండోవాడు చిట్లి రక్తంకారేచోట యింత యిసక పోశాడు. వాళ్లకు తెలిసిన ఫస్టెయిడ్ అదే! మంట పుట్టి వాడి ఏడుపు ఇంకాస్త ఎక్కువయింది.

దూరంగా గణగణమంటూ బడి గంట!!

అంతే, వెంటనే యిద్దరూ పరుగు లంకించుకున్నారు.

'కాలికి దెబ్బ తగిలి రకతం కారింది గందా, ఇప్పటిదాకా యేడుస్తూనే ఉన్నాడు. మరా యేడుపంతా యాడ కెళ్లింది? బడి గంట వినగానే ఒకటే పరుగు, ఒకటేపరుగు! బడి గంటలో అంత బ్రహ్మానందం వుంది కాబోలు! సదువులో అంత సరదా వుంది కాబోలు!'

అనుకున్నాడు, అక్కడే పశువుల్ని కట్టేసే గుంజకి ఆనుకుని నిలబడి చూస్తున్న యెంకటేశు.

చిరిగిపోయి లాగూ దిగజారిపోతావుంటే దాన్ని నో చేత్తో ఎగదోసుకుంటున్నాడు. అదీ బాగా మాసిపోయివుంది. చొక్కా లేదు. వళ్లంతా బూడిదగొట్టుకుపోయివుంది. శుభ్రంగావుంటే ఏ చాయలోవుండేవాడోగాని, యిపుడుమాత్రం వాడి శరీరం రంగు—బూడిద రంగు. కాళ్లు ఏనాడూ కడిగిన పాపాన పోలేదేమో. నల్లగా నిగనిగలాడుతూ మాడర్న్ ఆర్ట్‌లాంటి తెల్లని చారలు కనిపిస్తున్నాయి. మోకాళ్లనుంచి మడంవరకు,

వర్షాలు పడక నెరదలు తీసిన పొలంలా వుంది!

అన్నమాటం ముక్కు ఎగ బిలుస్తున్నాడు. గోళ్లు కొరుక్కోవడంలో లీనమైపోయి అలానే బళ్లోకి వెళ్లే పిల్లల్ని కన్నార్పకుండా చూస్తూ గుటకలు మింగుతూ నిలబడ్డాడు.

యెంకటేశు కిది నిత్యకృత్యం. వాడికి బడి అన్నా, బడి గంట అన్నా, బళ్లోకివెళ్లే పిల్లలన్నా ఎంతో సరదా. బడి గంట కొడుతుంటే అందులో వాడికి వసందయిన సంగీతం వినిపిస్తుంది. బడిపిల్లల్నిచూస్తుంటే పండగంతటి సంబరపడి పోతుంటాడు.

ఏ పనిలో మునిగివున్నాసరే, అది మానుకుని బడి గంట ఇంకాసేపటిలో కొడతారనగా వాకిట్లో గుంజ కానుకుని నిలబడి పిల్లల్ని చూస్తూ వుండడం వాడి అలవాటు.

అప్పుడే బుల్లబ్బాయిగారి కారొచ్చి రోడ్డు మీదాగింది.

బుల్లబ్బాయిగారిని చూస్తూ గుంజ వెనక్కి వెళ్లిపోయి ఆయన్ని దొంగచాటుగా తొంగి చూడడం మొదలెట్టాడు.

బుల్లబ్బాయిగారు బడి కట్టించడానికి డబ్బిచ్చారని, అందుకు బడి పేరు కూడ ఆయన తండ్రిగారిపేరు మీదనే వున్నదని యెంకటేశు విన్నాడు.

బుల్లబ్బాయిగారంటే — ఎంతెంతటి వాళ్లూ పిల్లుల్లాఅయిపోయి భయభక్తులతో ఆయన ముందు చేతులు కట్టుకు నిలబడతారు. ఒక కారూ లారీవున్న ఆయన గొప్పవాడుకాక మరేమవుతాడు? వూళ్లోవున్న వాళ్లందర్నీ వందేళ్లు పోషించగలిగినంతటి డబ్బు ఆయన దగ్గరుందని అందరూ అంటుంటారు. ఆయన మనిషి చూస్తే చాలా పీలగా వుంటాడు. రవుడీ జగ్గన్న ఎంతటి బలవంతుడనీ? ఒకసారి రెండాబోతుల ముక్కుకి తాడేశాడు! వూళ్లోవాళ్లంతా వాడి పేరు చెబితే హడలి చస్తారు. అలాంటి రవుడీ జగ్గన్న కూడా ఆయనగారి ముందు మాస్టారిముందు చదువుకునే పిల్లాడిలా అయిపోయి వో ఒంకర్లు తిరిగి పోతుంటాడు. అడుగో జగ్గన్న! లారీలోంచి దిగాడు. వచ్చి బుల్లబ్బాయిగోరితో మాట్లాడుతున్నాడు. అలా మాట్లాడుతున్న జగ్గన్నని బుల్లబ్బాయిగోరినీ చూస్తుంటే యెంకటేశుకి నవ్వొచ్చింది. ఆబోతు ముందు చిట్టెలుకలా వున్నారు బుల్లబ్బాయిగారు.

ఈ వూహ రాగానే యెంకటేశు పెదాల మీద చిరునవ్వు తొణికిసలాడినది.

డబ్బు ముందు ఎంత లావుపాటి బలమున్న మనిషన్నా బలాదూరే కామోసు!

ఆయన చెప్పినదానికల్లా తలాడిస్తూ హడావిడి చేస్తున్నాడు జగ్గన్న. లారీలోంచి చాలామంది మనుషులు దిగారు.అందరి చేతుల్లోనూ పారలూ గునపాలూవున్నాయి.

ఇదంతా చూస్తున్న యెంకటేశుకి కాస్త ఉత్సాహం మొచ్చింది. ఇవ్వేళ ఏదో విశేషమే వుండిఉంటుంది. ఎప్పుడూ దిగని బుల్లబ్బాయిగోరు రోడ్డు మీద కారు దిగారు. వెనకాల లారీలో మనుషులు! చోద్యంగా చూస్తూ నిలబడ్డాడు.

జగ్గన్న వాళ్లకి పనులు పురమాయించసాగాడు. కొందరు పారలూ, గునపాలూ తీసుకుని రోడ్డు చదును చేయడం ఆరంభించారు.

కొంతర్థమైంది యెంకటేశుకి. 'రోడ్డు బాగు చేస్తున్నారన్నమాట!' వాడిలో ఉత్సాహం రెట్టింపయింది.

రోడ్డు బాగు చెయ్యడమనేది వాడు పుట్టాక ఎరుగడు. పెద్ద వింతని, విడ్డూరాన్ని చూస్తున్నట్టుగా పరికించసాగాడు.

'యింక రోడ్డంతా నున్నగా ఉంటుందన్నమాట! గోతులూ గొప్పులూ ఉండవు. భలే! గోలీకాయలు నున్నటి రోడ్డు మీద సర్రున దొర్లిపోతాయి. ఇంచక్కా ఆడుకోవచ్చు. పాపం, బడి పిల్లలు రోజూ ఆ రోడ్డు మీద నడవడానికి ఎంత బాధ పడతున్నారో?

'వర్షాకాలంలో అయితే మోకాల్లోతు వూబిలో పడతా లేత్తా యెల్తుండేవోళ్లు. ఎండాకాలమైతే సరేసరి, కాళ్లకి దెబ్బ తగలని పిల్లోడేలేడు. పోనీలే పాపం ఇంక ఆ బాధుండదు బుల్లబ్బాయిగోరు ఎంత మంచోరు. ..'

ఇలా నున్నగావున్న రోడ్డు మీద పుస్తకాల సంచీ తగిలించుకొని హుషారుగా బడి కెళ్తున్న పిల్లల్లో తనూ ఒకడుగా వూహించుకుని కలల్లో తేలిపోసాగాడు యెంకటేశు.

అంతలో వాడికి మరో వింత దృశ్యం కనిపించింది. యెంకటేశు తండ్రి నర్సిగాడు ఇన్ని రంగు కాయితాల్ని తెచ్చి ముందేసుకుని కత్తిరిస్తూ కూర్చున్నాడు. కొందరు రోడ్డు కిరువైపులా గెడలు పాతుతున్నారు.

'అంటే ఈ రంగు కాయితాల్ని జెండాలుగా చేసి రోడ్డుకి ఆవైపునా ఈవైపునా కడతా రన్నమాట....అమ్మబాబో.....!'

అనుకున్నాడు. వాడిలో సంతోషం ఉరకలు వేస్తోంది.

'ఏంటబ్బా యియ్యాల? అంత అద్దంతరంగా ఏం పండగొచ్చి పడిందని ఇంత సరంజామా సేత్తున్నారు..' అనుకున్నాడు విషయం అర్థంకాక.

నెమ్మదిగా అడుగు లేసుకుంటూ నర్సిగాడి దగ్గరి కెళ్లాడు. కాస్సేపు అతను చేస్తున్న పనినే పరిశీలనగా చూస్తూ నిలబడ్డాడు. అలా కత్తిరించాలని యెంకటేశుకి ఉందిగాని ఎలా? తనని కత్తిరించనివ్వరు. ప్రక్కనే మరొకడు—కత్తిరించిన జెండాలకి పేస్టు రాస్తున్నాడు. వాళ్లు మాట్లాడే మాటల్ని బట్టి కొంత వూహించగల్గాడు.

'బడికి ఏదో పండగరోజంట. అందుకని ఎంతో దూరంనుంచి మంత్రిగోరు పని గట్టుకు వత్తన్నారంట! అమ్మబాబో...... మంత్రిగోరే. అందుకేనన్నమాట యింత అడావుడి. మంత్రిగోరంటే ఎలా ఉంటారు? రాజుగోరికయితే కిరీటం, బంగారంబట్టలూ వుంటాయట. మరి మంత్రిగోరికి కూడా కిరీటం ఉండి ఉండాల....బంగారం బట్టలు కాకపోతే యెండి బట్టలన్నా ఉండిఉంటాయి. ఆయన బళ్లో పిల్లలకోసం వత్తన్నారన్న మాట....! నేను కూడా చదువుకోడానికి యెళ్తే మంత్రిగోరు నన్ను కూడా సూసేవోరుగందా....'

అనుకున్నాడు యెంకటేశు వో బాధ పడిపోతూ. 'జెండాలకి పేస్టన్నా రాయనిస్తే బాగుండును.' అని ఉవ్విళ్లూరుతూ పేస్టున్న గిన్నె దగ్గర కెళ్లి కూర్చున్నాడు. అటూ యిటూ చూసి పేస్టుని గిన్నెలోంచి తీసి ఒక జెండా కాయితానికి రాయసాగాడు. ఆ డ్యూటీలోవున్న సోమిగాడు యెంకటేశుని చూసి నర్సిగాడితో ఫిర్యాదు చేస్తూ.

"యేరో నర్సిగా...మీవోడు 'పెద్దోళ్లల్లో కలిసిపోయేడు. ఇంకేం, నీకు రెండు సేతులా తిండే...' అన్నాడు యెకసెక్కెంగా

నర్సిగాడు యెంకటేశునిచూశాడు.చూసి

ఖారంలం ఉగ్రుడై పోయాడు.

"వాయాల. తగలడ్డావేంరా ..పోతావా కత్తిసిరేయమంటావా .... పీక తెగి గిలగిల్లాడాల. పోతావా పోవా....'అని గదిరించాడు.

యెంకటేశు బిక్క చచ్చిపోయి రాసు న్న పేస్నుని చేతిచే ఉంచేసుకుని లేచిపోయాడు. అక్కడినుంచి తప్పుకొని యథాస్థానంలో గుంజకానుకుని—చేతి కంటుకున్న పేస్నుని ఆ గుంజకి రాసూ నిలబడ్డాడు.

బుల్లబ్బాయిగారు జగ్గన్నకి ఏవేవో సూచన లిచ్చేసి కారులో రయ్యిన వెళ్లిపోయారు.

స్పీడుగా వెళ్లిపోయిన కారు లేపిన దుమ్ము కొండంత ఎతున లేచింది. ఆ దుమ్ము యెంకటేశు ముక్కుల్లో దాకా వెళ్లింది దానివిపీలుసూ 'ఎంత కమ్మగా ఉంది!' అనుకున్నాడు దానిని యింకా యింకా ఎగపీలుసూ. ఆ అనుభూతిలో అలాగే ఎంతోసేపు ఉండిపోయాడు.

* * *

రోడ్డంతా యిపుడు ఎంతో చదునుగా వుంది. శుభ్రంగా తయారయ్యింది. ఇరువైపులా కట్టిన రంగుకాయితాల్తో, రోడ్డుకి కొత్త అందాని, కూర్చాయి. ఎక్కడ బడితే అక్కడ తోరణాలు, జెండాలు. ఇవన్నీ రోడ్డుకి అదో రకమైన వాసనని కూడ తెచ్చి పెటాయి.

'రోడ్డు యింత బాగ తయారు చేసే బడి యింకెంత అందంగా అలంకరించి

# చదువు

ఉంటారో అనుకున్నాడు యెంకటేశు.

ఆ రోజు పిల్లలంతా దేవతల్లా కనిపించారు. ఎప్పుడూలేని ఆనందం సంతోషం. వాళ్లల్లో వ్యక్తమవుతోంది.

'స్కూల్ డే' అవడంతో అంతా మంచి మంచి బట్టలేసుకుని శుభ్రంగా నీట్‌గా ముస్తాబయి వెళు న్నారు

పిల్లలేకాదు, పెద్దవాళ్లు కూడా బడిలో జరిగే పండుగ వేడుకని చూడ్డానికి మంత్రిగార్ని చూడ్డానికి వెళు న్నారు.

కాస్సేపటిలో పెద్ద రణగొణధ్వని ఆరంభమయింది.

'వచ్చేసు న్నారు ..... వచ్చేసు న్నారు...'

అంటూ పిల్లలంతా హడావిడిగా పరుగెత్తుకుంటూ బడికేసి వెళ్లిపోతున్నారు.

'అంటే మంత్రిగోరొస్తున్నారన్నమాట! యెల్లేది ఇలాగేగదా... నేను సూడొచ్చును.'

అనుకుంటూ రోడ్డుపైకి వచ్చాడు యెంకటేశు

దూరంగా మంత్రిగారి కారు కనిపించింది. చుట్టూ జనం. బోల్డంత మంది జనాన్ని రెండు పాయలుగా కోసూ మంత్రిగారి కారు నెమ్మదిగా వస్తూంది. జనం మంత్రిగార్ని చూడ్డానికి తొక్కిసలాడిపోతున్నారు.

కారు యింటిముందుదాకా వచ్చింది. మంత్రిగారిని చూడ్డంపోయె, కనీసం ఆయన కారుని చూడ్డానికయినా, ఆయన కారు లేపిన ధూళిపీల్చడానికయినా అవకాశం లేకపోయింది యెంకటేశుకి!

ఎలాగయినా పరుగెత్తుకెళ్లి జనం — మధ్యకు చొచ్చుకుపోయి మంత్రిగార్ని చూడాలనుకున్నాడు. ధైర్యంచేసి జనం మధ్యకి వెళ్లబోయాడు. ఏమీ లాభంలేకపోగా క్రిందపడినపుడు మోకాళ్ల చిప్పలు రాసుకుపోయాయి.

కారు దూరంగా వెళ్లిపోయింది. బెల్లం ముక్కని పట్టిన చీమల్లా జన సందోహమూ దాంతోపాటు తరలి వెళ్లిపోయినది.

ఒంటరిగా బిక్కు బిక్కుమంటూ దిగబడిపోయాడు యెంకటేశు.

బడిలో జరగబోయే ఉత్సవాన్ని చూడ్డానికి ఎంతోమంది తరలి వెళు న్నారు.

'తనుమాత్రం ఎందుకు వెళ్లకూడదు?'

వెంటనే గేటుదగ్గర మీసాల సామి జ్ఞాపకమొచ్చి ఒళ్లు జలదరించినది.

'అమ్మబాబో'... 'అనుకున్నాడు.

బడి చూడ్డానికి వెళ్తూ ఒకసారి మీసాలా సామీచేత తన్నులు తినడం జ్ఞాపకమొచ్చి కళ్లనీళ్లు నింపుకున్నాడు. తనకా అదృష్టం లేదని!

చాలమంది జనం వెళ్తున్నారుగా. ఇవ్వేళ ఫరవాలేదు జనాన్ని చాటు చేసుకుని దొంగ చాటుగా లోపలికి వెళ్లిపోవచ్చునని కూడా అనుకున్నాడు.


ఎన్నాళ్లినుంచో వున్న ఒక్కగా నొక్క కోరిక బడిని తనివితీరా చూడ్డం. అదీ తీరిపోతుంది. పనిలో పనిగా మంత్రిగారిని కూడా చూసెయ్యొచ్చు. ఎంతమంచి అవకాశం? వెళ్తే ఎంత బాగుండును?

అంతలో బడిగంట గణగణ లాడింది. ఆ మోత ఎప్పుడూ యెంకటేశు చెవులకి వినిపించేదే. అయినా, ఆ రోజు ఏదో మధురమైన స్వరం ఆ ధ్వనిలో వినిపించింది.

'ఏమైనా సరే యెల్లి తీరాలి' అనుకున్నాడు నిశ్చయానికివస్తూ.

ఒకసారి కిందనుంచి పైదాకా తనను తాను చూసుకున్నాడు. నిరుత్సాహపడ్డాడు. జారిపోతున్న లాగూను అదిమి పట్టుకుని ముందుకు సాగబోయాడు.

"యారా....యా బ్రాసి సచ్చినోడా ..... పేడ కల్లు తియ్యమని ఎంతసేపయిందిరా సెప్పి ...గుంజకాడ అట్టానే బిగుసుకుపోయావేంది..'..'



అలాటి యెంకటేశు కాట్లు కొట్టి కని వంగదీసి రెండు గుద్దింది ఇచ్చి.

యెంకటేశు కిమ్మనలేదు. గుడ్ల నీళ్ళు గ్రుక్కుకుని పెదకళ్ళనిలిపి తట్టలో వెయ్యసాగాడు.

ఇచ్చి యెంకటేశుకి తల్లి. ఆ తల్లికి నలుగురు కూతుళ్ళున్నారు. నర్సిగాడికి వీ డొక్కడే మొగపిల్లాడు. పిల్లాడు ఒక డయినందుకైనా వాడిమీద అపేక్ష కన బరచడు నర్సిగాడు. గంజే పరమాన్నమను కుని జీవించేవాళ్ళకి ప్రేమ, అపేక్షలాంటి పదాల అర్థాలు వెదుక్కునేందుకు సమయ మెక్కడుంటుంది? రెక్కాడితేగాని డొక్కా డని పరిస్థితి. ఎంతసేపూ పని, తిండిగింజల యావేగాని సంతానం, సుఖం, సంతోషం లాంటి వాటిజోలికి పోవు నర్సిగాడి ఆలో చనలు. ఒక్క పిల్లో పిల్లాడో అయితే వాళ్ళ బాగోగుల గురించి ఎప్పుడన్నా—కనీసం కునుకుతీసే ముందయినా ఆలోచించి ఉండే వాడేమో! కాని ఒకదాని తర్వాత మరొకర్తె వరసగా అయిదేళ్ళలో నలుగురు ఆడ పిల్లలు. చిన్న దింకా పాలు తాగుతోంది. వున్న తీరికలోని ప్రేమ కాస్తా చిన్న పిల్లల కోసమే ఖర్చయిపోతే యింక యెంకటేశుకేం మిగుల్తుంది పాపం!

అందుకే నిండా ఏడేళ్ళు నిండని యెంక టేశు నర్సిగాడి దృష్టిలో చేతికందొచ్చిన బిడ్డ!

ఉదయమే లేవడం, పిల్లల్ని ఆడించడం, దూడల దగ్గర శుభ్రం చెయ్యడం. వాటిని మేతకు తోలుకెళ్ళడం. మళ్ళీ గోధూళి వేళ యింటికి రావడం. ఎప్పుడో జాము రాత్రికాడ నిద్రపోవడం యెంకటేశు నిత్య కార్యక్రమం. చీటికీ మాటికీ కొట్టు దగ్గ రికి పరుగెత్తి కెళ్ళి ఉప్పూ, మిరపకాయ లాంటి చిల్లర సామాన్లు తేవడం, నర్సి గాడికి చద్ది పట్టుకుని పొలం వెళ్ళడం లాంటి పనులు కూడా ఉన్నాయి. ఇంత చాకి రీకీ వాడికి ప్రొద్దుట చద్దన్నం, రాత్రి గంజన్నం ఈ రెండు పూటలు తిండి దొరుకుతుంది.

తీరిక దొరికినప్పుడల్లా చదువు గురించే వాడి ఆలోచన. అట్లా ఆలోచించినప్పుడు చేసే పొరపాటు పనులకి అడపా తడపా అమ్మ చేత చెప్పు దెబ్బలు వాడికి అలవాటై పోయాయి.

## రచయితలకి మనవి

ప్రచురణకి స్వీకరించబడని తమ రచనలు తిప్పి పంపగోరే వారు (వాత ప్రతులతోబాటు తగుమాత్రం తపాలాబిళ్ళలు అతికించిన, స్వంత చిరునామా గల కవర్లు పంపాలి. స్టాంపులు మాత్రం పంపిన రచనలు తిప్పి పంపటం సాధ్యం కాదు. కనుక రచయితలు పై నిబంధనని గమనించ ప్రార్థన. (విడిగా స్టాంపులు అతికించిన, స్వంత చిరునామా కవరు పంపించినప్పటికీ రచనలు తిప్పి పంపటానికి వీలు కాదు.)

సం॥


తెల్ల వెంట్రుక లుండవు

పొగడడం మాకు ఇష్టంలేదు. కానీ మా "కేశ రంజన్" ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్ల వెంట్రుకలు నల్లవిగా మార్చి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధిపరచును. లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 10/-

Western India Co., (S.N.)
P.O. Katri Sarai (Gaya)

ఉచితము! ఉచితము!

తెల్ల మచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత "SOMRAJI" మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగును పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసామందు ఉచితముగా పంప బడును. వెంటనే వ్రాయండి. వివరాలకు:

Western India Co., (V.N.)
P.O. Katri Sarai (Gaya)

కే. టి. కృష్ణమూర్తి ఆచార్యగారి



"మేల్మాయిల్ మందు"

నల్లరంగు, ఎర్రరంగు పొడలు, దద్దులు గజ్జి మరియు వెడ్డనీర వ్యాపించినందున ఏర్పడు వినుగు పుట్టించు రణములు మొదలగు

దీర్ఘకాల చర్మరోగములకు ఉత్తమ నివారిణి

వివరములకు

సిద్ధ డాక్టర్ కే. టి. కృష్ణమూర్తి ఆచార్యరి & సన్సు
5/22, మేల్మాయిల్, (P. O.) N. A. Dt.

లిట్‌క్విజ్ నెం. 67

రూ. 50,000

మిని 'ఏ' & మర్ఫీ ట్రాన్సిస్టర్ గల మిని 'బి'

ముగింపు తేది : 10—6—1970 బుధవారము

సండే స్టాండర్డ్ నందు ఎంట్రీ ఫారము చూడండి. స్థానిక ఏజంట్లను అడగండి. లేక లిట్‌క్విజ్ ఏక్ కాపీకై వ్రాయండి. ఉచితంగా పంపెదము.

LITQUIZ PRIVATE LTD., BOMBAY-7.

4 th Anniversary Bumper No 68. on 7—6—1970

[illegible] స్తే పోయింది. వాళ్ళమ్మ వాడిని చంటిదాని దగ్గర కాపలావేసి ఆమె కూడ తిగార్ని చూడ్డానికి వెళ్ళింది!

* * *

మామూలుగానే ఆరోజు కూడా దూడల్ని తోలుకెళ్ళాడు యెంకటేశు. వాడి వయసు వాళ్ళు ఇంకా చాలమంది దూడల్ని మేపుతున్నారు. వాళ్ళందర్నీ వదిలి వంటరిగా తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చు

# చదువు

న్నాడు.

"యేరా ...పొద్దుటేల సద్దినేదా నలికిడిలాగూసున్నావ్" అన్నాడు పోటి జగ్గులుగాడు పలకరిస్తూ.

యెంకటేశు వాడి మాటల్ని పట్టించుకోనట్టు అటు కొంచెం జరిగి కూర్చుని తన ఆలోచనలో తను మునిగిపోయాడు.

"యేరా...మాట్లాడవేందిరా'.. ఇదిగో [illegible] సింతకాయ [illegible] దోరకాయ మున్సపుగారిసెట్టుది...." అన్నాడుజగ్గులుగాడు. ఒకపక్క పళ్ళిన దోర చింతకాయ, వాడికి చూపిస్తూ.

యెంకటేశుకి నోరూరింది. చింతకాయ తీసుకున్నాడు. నోట్లో పెట్టుకుని ఒక కణుపు కొరికి.

"యేరా జగ్గా నువు మంత్రిగోర్ని సూశావురా......" అనడిగాడు.

"ఆ సూడక సోవడమేంది....లబ్బ.... అబ్బ ఆయనగోరి టీవి, దర్జా మన బుల్లిబ్బాయిగోరికి కూడా లేవనుకో..."

"అలాగా.....కిరీటం అదీ ఉన్నదట్రా.... ఏం బట్ట లేసుకున్నారు.....బంగారానివా—యెండివా."

"శ... యెదవ మొకమా... మంత్రిగారంటే యేమనుకున్నావు. యెండి బట్టలేసుకుంటారా...? శ.....! నీ కస్సలేమీ తెలవదురా. బంగార బ్బట్టలే యేసుకున్నారు. ఆయనగోరి కిరికేటం ఎంత బాగుందనుకున్నావ్ ..." అన్నాడు చింతకాయ చప్పరిస్తూ జగ్గుగాడు.

"అలాగంటరా.....మంత్రిగోర్ని నువ్వెలా సూడగలావురా.....నిన్ను రానిచ్చేరా......"

యెంకటేశు వేసిన ఈ ప్రశ్నకి సమాధానంకోసం ఆలోచించి, తట్టక—ఉండుండు దూళ్ళు సేలో పడేలా ఉన్నాయి సూసొస్తా"

అని పరుగెత్తు కెళ్ళి పోయాడు జగ్గులు. వాడు దూడల్ని అదలించనూలేదు. ఏంలేదు. శంద్రిగాడితో మాట్లాడుతూ నిలబడ్డాడు. కాస్సేపటికి శంద్రిగాడు యెంకటేశు దగ్గరికి వచ్చాడు.

వాడిని చూస్తూ నే.. ...

"యేరా శంద్రిగా .....నువ్వెప్పుడన్నా బళ్ళో కెళ్ళావురా...." అనడిగాడు యెంకటేశు ఆత్రాన్ని ఆపుకోలేక.

శంద్రిగాడికి అందులో ఏం విచిత్రం కనిపించిందో ఏమో పగలబడి నవ్వడం మొదలెట్టాడు.

"శ ...ఎందుకురా అలా నవ్వుతావ్..? అన్నాడు విసుగ్గా యెంకటేశు.

"మరేందిరా'... మనం బళ్ళోకి ఎలా యెళ్తా మనిరా...నువ్వడిగేది? ఎక్కడయినా పాలేళ్ళు బళ్ళోకి యెళ్తా రేంటి?" అన్నాడు వాడు అమాయకంగా.

(ముగింపు పైవారం)

## చరిత్రలో జరగని విశేషాలు!

### జాన్ కోర్ట్

అమెరికాని కనిపెట్టిన మనిషి కొలంబస్ కాదు, గిల్లెటిన్‌ని నిర్మించిన వ్యక్తి డాక్టర్ గిలటిన్ కాదు — అంటే! తప్పు అన్నట్టు మాత్రం కాదు. రెండూ ఎందరికో తెలియని సత్యాలు (లేదా ఎందరికో తెలిసిన అసత్యాలు కూడా అనుకోవచ్చు...)

'రొట్టె లేకపోతే కేక్ తినమను!' అని ఫ్రెంచిరాణి మేరీ ఆంటోయినెట్ అన్నదని చదువుతాము. ప్రజలు రొట్టె లేక మాడుతున్నారని ఆమెతో ఎవరో అంటే ఇలాగ అన్నది (ట.) అసలు ఈ మాట ఆమె అనలేదు. ఫ్రెంచి విప్లవం జరిగిన 50 ఏళ్ల ముందు ఫ్రెంచి తత్వవేత్త రూసో ఏదో సందర్భంలో ఏదో ఒక సంఘటనని వర్ణిస్తూ వాడిన మాటలు ఇవి!

ఫ్రెంచి విప్లవంలో తలలు తీసి వెయ్యటానికి 'గిలటిన్' అనే యంత్రం వాడారని ఎందరికో తెలుసు, దాని కనిపెట్టిన వ్యక్తి పేరు కూడా అదే అనుకుంటారు. వారి ఊహ తప్పు! అది కొన్ని వందల ఏళ్ళగా వాడుకలో ఉన్న యంత్రం. (గిలటిన్ తల దాని మొదటి 'బలి' అనే కథకూడా ఉంది. అదీ అబద్ధమే! ఆయన చనిపోయినప్పుడు తల [illegible] శరీరం కలిసే ఉన్నాయి...)

ఫ్రాన్స్ నుంచి తూర్పు ప్రయాణం చేస్తే 'ఇనపతెర' అనే మాయామయనిక ఒకటి ఉంది (ట). ఈమాటంలని వాడిన మొదటి మనిషి విన్స్టన్ చర్చిల్ అనుకుంటారు (కొందరు!) మొట్టమొదట ఈ సందర్భంలో దీనిని వాడిన ఆయన పేరు సర్ థామస్ ట్రౌబ్రిడ్జ్ ...

ఇంకా తూర్పుగా వెడితే అమెరికా వస్తుంది. కాని, కొలంబస్ పడమరగా వెళ్ళి ఈ ఖండాన్ని కనిపెట్టాడు. అయినేనా ఈ పనిని మొదటిసారిగా చేసిన యూరప్ వాసి? కాదని కొందరు పండితులు అంటున్నారు. ఇటీవలే దొరికిన ఒక పాత భూగోళపటం 1440 లో గీసినది కాబట్టి, అది అమెరికాకి సంబంధించినది కాబట్టి... కొలంబస్‌కన్నా అమెరికా ముందు చూసిన యూరోప్ ఖండవాసుల ఇద్దరి పేర్లు లెయిఫ్ ఎరిక్సన్, బ్యార్ని! అమెరికాని వారు 'ఫిన్‌లాండ్' అని పిలిచారుట...

బయిబిల్‌లో ఈవ్ ఆపిల్ తిన్నదంటారు. అసలు పుస్తకంలో ఆపిల్ ప్రసక్తే లేదు! 'పండు' అనిమాత్రం ఉంది...

[కొ. వ. ఫీ.]

# చదువు

యమ్. పద్మినీదేవి



(గత సంచిక తరువాయి)

'అస్సలుబళ్లో ఎలా వుంటదంటావ్...?' అన్నాడు యెంకటేశు కూతూహలంగా.

'ఎల్లా వుంటదేంటి? పెద్ద పెద్ద గదులుంటాయి పంతులుగారికి కుర్సీ వుంటది పిల్లలకి సీఁతిలుంటాయి. నల్లబల్లుంటాది అంది మీద పంతులు గోరు సీమ సొన్నంతో రాత్తారంట. అది సూసి పిల్లలు పుత్తకాల్లో రాసుకుంటారంట... ఆ గదిలోనే ఆటలు నేర్పుతారంట—మొక్కలు పెంచుతారట—బొమ్మలెయ్యడం కూడా నేర్పుతారంట...'

'అదికాదురా సవటనాగన్నా ... సదువు నేర్చుకోవడం ఎలా వుంటంది అని...'

'ఆఁ...అదా ... అది మనకెలా తెలుత్తాది? సదుముకుంటే గందా...?'

'పిల్లలంతా సదుముకునేప్పుడు తొంగి సూత్తేనో...?'

'ఆ యమ్మబాబో... బళ్ళోకెళ్లి సూడ్డమే...? అక్కడ పెద్ద పంతులో కుంటారంట. ఎప్పుడూ సింతబెత్తం పుచ్చుకుని బడీసుట్టూ తిరుగుతూ వుంటారంట. ఆయన గనక సూత్తే యింకేమన్నా వుందా? మొన్నా మద్దెన మేం జరిగిందో తెలుసా? మా కాపులింటి సిన్నబ్బాయి గోరులేరూ ... ఆయన్ని పంతులు గోరుకొడ్తె తప్పి రవలా యింకా నొప్పి తగ్గనేదు. సదుముకునే వోళ్లనే అలా కొట్టితే...మనల్నయితే యింకేమన్నవుందా 'సిరకాబతకా సింతకాయ పచ్చడి సేసెయ్యరూ?'

అన్నాడు భయం భయంగా శంద్రిగాడు.

'దొంగసాటుగా సూత్తేనో...'

'సుట్టూ యింతెత్తు గోడుంది. గేటు కాడ బ్రమ్మరాచ్చసుడు గూసున్నాడు. ఎలా సూత్తవూ అంట. నువ్వూ నేనూ యిలాయిల్తే అస్సలు లోపలికి రానివ్వడం కాదుకదా...గేటుదగ్గరికికూడా రానివ్వరు ఏమోబాబూ ... నేను యింకాపూను ఎత్తను. ఎత్తనంటే ఎత్తను తలుసుకుంటేనే జడవు' అన్నాడు శంద్రిగాడు చెయిజాపుతూ.

వాడిచేతిలో ఒక గుణువు చింత కాయ ముక్క పెట్టి మవునంగా కూర్చున్నాడు యెంకటేశు కాస్సేపటికి అన్నాడు—

'హారే...జగ్గూ నాకోసాయం సెయ్యరా సేత్తావా...?'

'ఏంటది?'

'యియ్యాల ఐడివుందిగదా...?'

'వుంది...'

'నేను వొకసారి బడిదగ్గరకెళ్లి వొచ్చేత్తాను. ఈలోగా నా దూడల్నిసూత్తూ వుండు. ఇప్పడే సిటికెలో వచ్చేత్తాను...'

'మరయితే వచ్చేప్పుడు వుప్పా కారం కూడా తెత్తావా... జగ్గులుగాడి దగ్గర బోల్డన్ని సింతకాయలున్నాయి. పట్టియ్యి తింటే పులుపుంటాదు...'

'అలాగే తెత్తానుగాని... నువు నా దూడల్ని సూత్తావుండు ...' అంటూ ఒకటే పరుగుతీసి బడిదగ్గరికి వొచ్చేశాడు యెంకటేశు.

బడిచుట్టూ పెద్దకాంపవుండు వుంది దానికి పెద్దగేటు. గేటుమీద స్కూలు పేరూ అదీ రాసివుంది. పరిశీలనగా చూశాడు యెంకటేశు.

గేటువారగా తీసేవుంది. మీసాలసామి జాడ ఎక్కడాలేదు ఫరవాలేదనుకున్నాడు. పిల్లిలా నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ లోపలికి వెళ్లాడు. అక్కడి దృశ్యంచూసి తన్నుతాను మరచిపోయాడు.

చెట్లూ, రకరకాల మొక్కలూ, పూలపొదలూ అందంగా అలంకరించిన రంగు కాయితాలతో నందనవనంలా వుంది.

ఎక్కడో అలికిడైంది. వెంటనే ఒక చెట్టుచాటున నక్కాడు. మీసాలసామీ అటే వెళ్లాడు కాని యెంకటేశుని చూళ్లేదు. 'హమ్మయ్య' అనుకున్నాడు. ఇప్పుడు బడిలోపలికి నిరాటకంగా వెళ్లిపోవచ్చు. చెట్లు అడ్డున్నాయి మీసాలసామి కనిపించడు.

వరండాదాకా దొంగలా శబ్దం చేయకుండా వెళ్లాడు. కాని ఇక ముందుకు వెళ్లడానికి ధైర్యం చాల్లేదు, గుబురుగా పెరిగిన ఒక మొక్కచాటున దాకున్నాడు.

అక్కడినుంచి చూస్తుంటే వరసగా చాలాగదులు కనిపిస్తున్నాయి అవే చదువుకునే గదులై వుండాలి. కొంచెం ధైర్యంచేస్తే ఒక గదిని చేరుకోవచ్చు. వెళ్లడానికి ఉద్యుక్తుడవుతుండగా— దూరంగా ఒకగది తలుపు తెరుచుకుంది. అందులోనుంచి లావుపాటాయన ఒకరు వరండామీదకు వచ్చారు. ఆయన చేతులో పొడవాటి చింతబరిక వుంది'

'అమ్మ బాబో...పెద్దపంతులోడు !'

యెంకటేశుకి పై ప్రాణాలు పైనే పోయాయి.

'పెద్ద పంతులోరి కళ్లబడితే సంపేత్తారు.'

అన్న శంద్రిగాడి మాటలు చెవుల్లో గింగురుమన్నాయి. యెంకటేశుకి వొళ్లంతా చెమటపట్టింది.

చింత బరికాయన ఇటే వస్తున్నాడు. తనవైపునే వస్తున్నాడు. ఎలా...ఎలా ?

వస్తూ వస్తూ ఏం జ్ఞాపక మొచ్చిందో ఏమో ఆయన మళ్లీ వెనక్కితిరిగి ఆ వైపుకు వెళ్లిపోయాడు.

'హమ్మయ్య...' అనుకున్నాడు యెంకటేశు.

ధైర్యం తెచ్చుకున్నాడు. వూడిపోయే లాగూ రెండుసుతలూ లాగి గట్టిగా ముడేశాడు. దానిమీద మొలతాడు గట్టిగా అదిమిపట్టేలా బిగించాడు. ముక్కు శుభ్రం చేసుకుని ముందుకి సాగిపోయాడు.

అక్కడో తరగతి గది వుంది. గుమ్మంలోనుంచి నెమ్మదిగా తొంగిచూశాడు. పిల్లలంతా బెంచీలమీద కూర్చుని వున్నారు పంతులుగారు కనపడ్డం లేదుగాని ఆయన కంఠం వినిపిస్తోంది ఆయన ఏదో చెబుతున్నారు. పిల్లలు చెవులు రిక్కించుకుని వింటున్నారు. ఆయన చెప్పేది యెంకటేశుకి వినపడుతున్నది గాని అర్థం కావటంలేదు

ఆ వాతావరణాన్ని చూస్తే యెంకటేశుకి యెంతో ముచ్చటేసింది పంతులుగారు చెప్పేది ఏమీ అర్థంకాక పోయినా శ్రద్ధగా ఆనందంగా వినసాగాడు.

'తల్లి పాలిచ్చి పెంచి పెద్ద చేస్తుంది, బడి విద్యాబుద్ధులు గరపుతుంది. బడి—తల్లి రెండూ సమానం...'

పంతులుగారు ఏమేమో చెప్పుకుపోతున్నారు.

యెంకటేశుకి అర్థమయ్యిందిఒక్కటే. 'బడి' 'అమ్మ' ఇద్దరూ ఒకటే అన్నది. అమ్మగురించి చాలాచెప్పారాయన. ఆయన చెప్పినదానిలో 'మచ్చుకి ఒక గుణమయినా అమ్మలో లేదు–' అనుకున్నాడు. అందుకని అమ్మకంటేకూడా బడి ఎక్కువ గొప్పది అనే నిర్ణయానికి వచ్చాడు. అమ్మనీ—బడినీ పోల్చుకుంటూ— వాటిని గురించి ఆలోచిస్తూ ఎంతసేపు వున్నాడో వాడికే తెలియదు.

దూరంగా చింతబెత్తమాయన తిరిగి వస్తూ కనిపించాడు

యెంకటేశు గుండెలు గుబ గుబలాడాయి. స్ప్రరున పరుగెత్తి తారాజువ్వలా కాంపవుండు దాటి బయటపడ్డాడు.

హెడ్‌మాస్టరు పిలిచిందీ వాడికి వినిపించలేదు, గేటుకాడ మీసాలసామీ అదిలించిందీ వాడికి తెలియలేదు. అంత వేగంగా పరుగెత్తు కెళ్లాడు.

గేటవతల పడ్డాకకూడా అలాగే కొంత దూరం పరుగెత్తుకొచ్చి—వెనక ఎవరూ తరుముకు రావడంలేదు ఫరవాలేదు అని అనుకున్నాక కాస్సేపు అక్కడే నిలబడి ఆయాసం తీర్చుకున్నాడు.

బడి ఎంత బాగుంటుంది ?

అందులో అడుగెడితేనే చాలు ప్రాణానికి ఎంతోహాయి అనిపించింది. పంతులుగారు చెప్పేది వింటుంటేనా ? అబ్బ ... అంతకంటే ఆనంద మేముంది ? అంతకంటే అదృష్ట మేముంది ? ఏంలాభం? తనకా అదృష్టంలేదు. అదృష్టవంతులైన పిల్లలు చదువుచెప్పించే యిళ్లలో పుడతారు లేనివాళ్లు లేనివాళ్లయిళ్లలో పుడతారు !

'సదువు మాటెత్తితే సాలు, అమ్మ గంగ యెర్రు లెత్తినట్టు ఆడిపోసుకుంటాది. బాబు సరే సరి—సివాలెత్తుతాడు యింక సదువుకుంటానని యెవరితో సెప్పుకుంటాడు? తన బతుకింతే. తన బతుక్కి చదువులేదు. బడిలేదు గిడిలేదు ...శ్శ. .యెదవబతుకు...'

అనుకుంటూ దిగాలుగా పొలం చేరుకున్నాడు.

'వారేయ్ ... యెంకో...మి దూడలు రంగయ్యగారి ఆకుమడి సేలో పడ్డయ్యి. ఆయన ఆటిన్ని తోలుకెల్లి బందుల దొడ్లో యెట్టాడు...'

అన్నాడు సూరిగాడు కనిపించి.

'ఏడీ...ఆశంద్రిగా డెక్కడ...?'

అన్నాడు కంగారుగా యెంకటేశు.

శంద్రిగాడు నవ్వుకుంటూ ఎదుటికొచ్చి నిలబడ్డాడు తక్కినవాళ్ల నందర్నీ పిలిచి —

'సూడండెహె...ఈడు బళ్లో కెల్లాడు సదుముకోడానికి...ఈడి దూడలు బందులదొడ్లో కెల్లాయి తమాసా సూడ్డానికి...'

అన్నాడు నవ్వుతూనే. తక్కినవాళ్లంతా చప్పట్లు కొడుతూ గొల్లున నవ్వారు.

యెంకటేశుకి ఏడుపు ముంచుకొచ్చింది. ఏడుస్తూ కూర్చున్నాడు. అందరూ పశువుల్ని యిళ్లకు తోలుకుపోయారు. యెంకటేశు మాత్రం కూర్చున్న బండ మీదనే కూర్చుండిపోయాడు.

ఇప్పుడెలా ?

'ఇంటికెల్తే బాబు సితక తన్నుతాడు.'

ఏం చెయ్యాలో పాలుపోక ఏడుస్తూ కూర్చున్నాడు.

అప్పటివరకూ చెదురు మదురుగా వున్న మేఘాలు దట్టంగా పేరుకోసాగాయి. చలిగాలి వీస్తోంది. చీకటి పడిపోయింది.

చిన్నగా చినుకులు కూడా ఆరంభ మయ్యాయి.

యెంకటేశు కదల్లేదు.

రాత్రయేకొద్దీ వర్షమూ ఎక్కువయింది. యెంకటేశు బండమీదే తడుస్తూ ఏడుస్తున్నాడు.

దూరంగా ఒక గుడ్డిదీపం కనిపించింది.

ఇంత రాత్రివేళ ఇంత జడివానలో తన వైపు ఎవరొస్తారు? ఇంకెవరు? బాబే! సంశయం లేదు.

ఇంకోసారయితే నర్సిగాణ్ని చూసి భయంతో పరుగెత్తేవాడే కాని, ఇప్పుడా ఓపిక లేదు.

ఆకలయి పేగులు తోడేస్తున్నాయి. కడుపులో ఎలకలు పరుగెడుతున్నట్టుగా వుంది. ఎంతో నిస్సారంగా వుంది. లేవడానికి కూడా ఓపిక లేదు.

దీపం దగ్గరయింది. ప్రక్కగా వొచ్చి నిలబడింది.

'యేరా...యేంటి నీ కత? దూడల్ని దొడ్లోకి తోలి...బళ్ళోకి యెల్లావంటవే? నీకు సదుము కావాల్సొచ్చిందటరా... సవట నాగన్నా...'

అంటూ నర్సిగాడు చేతిలోవున్న దుడ్డుకర్ర తీసుకుని యెంకటేశు వీపు మీద వేశాడు.

'కుంయ్‌క్కు' మన్నాడు దెబ్బ పడగనే యెంకటేశు; పరుగెత్తే ఓపిక లేదు.

నజ్జు నజ్జుగా నానిపోయిన యెంకటేశు

# చదువు

నర్సిగాడి కాళ్ళని గట్టిగా పట్టుకుని 'బాదుకో'మన్నట్టు వీపు ఒగ్గేశాడు.

దారి పొడుగునా బాదుకుంటూ యింటికి తీసుకొచ్చాడు నర్సిగాడు. అంతతో సరిపెట్టకుండా లచ్చి కూడా నాలుగు తినిపించింది.

'సచ్చినోడికి ఈ యేల కూడెట్టకు' హుకుం జారీ చేశాడు నర్సిగాడు.

నర్సిగాడు చెప్పకపోయినా యెంకటేశుకు కూడు పెట్టేది కాదు లచ్చి. ఆమెకీ కోపంగానే వుంది.

వర్షం జోరు ఎక్కువయింది. వర్షంతోపాటు గాలి, రెండూ విపరీతంగా విజృంభించాయి. గాలికి యింటి మీద కప్పు ఎగిరిపోయి వర్షం కురవ నారంభించింది. యెంకటేశు మూలుగును మింగేసే వురుములు!

తెల్లారింది.

మామూలుగా కాదు. తుఫాను పెడబొబ్బల మంగళరావాలతో, హోరున వర్షం అక్షంతలు జల్లుతుండగా తెల్లారింది.

వర్షం నీళ్ళు రోడ్ల మీద కాలువల్లా ప్రవహిస్తున్నాయి.

అంత వానలోనూ హడావిడిగా వెళ్తున్న హెడ్‌మాస్టరు నర్సిగాడి యింటిముందాగి, 'నర్సి...' అని పిలిచారు.

ఆ కేక విన్న యెంకటేశు తడిక కన్నంలోనుంచి చూశాడు.

ఇంకేముంది! చింత బెత్తమాయన!

'దొంగతనంగా బళ్ళోకి యెల్లినందుకు బాబుతో సెబుతారు కామోల్ను! మళ్ళీ దెబ్బలు...ఎలా?'

అనుకుంటూ బలాన్ని కూడదీసుకుని లచ్చికి కూడా కనిపించకుండా నెమ్మదిగా బయటికి వచ్చేశాడు.

హెడ్‌మాస్టరు పిలవగానే నర్సిగాడు బయటికొచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

'గాలివాన ఎక్కువయేలా వుంది. మనమంతా వూరు ఖాళీచేసి పట్నం పోవాలని పైనుంచి వార్త వచ్చింది. నీళ్ళు వూరంతా చుట్టేశాయి. అప్పుడే బడి ఒక పక్కంతా కూలిపోయాయి. వెంటనే కదలండి.'

అంటూ సాగిపోతూ మళ్ళీ ఏమి గుర్తొచ్చిందో ఏమో, వెనక్కి వచ్చారు. వచ్చి—

'నర్సిగా...యెంకటేశు నీ కొడుకేగా?' అనడిగారు.

'అవును బాబయ్యా... ఏమన్నా పొడు పని చేసేడేంటి...సెప్పండి మక్కె ఇరగ తంతాను...' అన్నాడు వినయంగా.

'అబ్బే...లేదు. కుర్రాడికి చదువంటె చాల ఆసక్తిగా వున్నట్టుంది. స్కూల్లో చేర్పించరాదూ?'


అన్నారాయన.

'సదువా...సట్టుబండలా? గొడ్లని కాయడం శాతకాని యదవకి సదువే మొత్తాది పంతులుగోరూ ... సేతికందొచ్చాడు. వచ్చేయేడు మీలాంటి మీలాంటోళ్ళల్లో గొడ్లకాడెడదామనుకుంటున్నాను.' అన్నాడు నర్సిగాడు.

'సరే నీ యిష్టం... మీరు మాత్రం వెంటనే బయల్దేరండి...'

అంటూ హడావిడిగా వెళ్ళిపోయారు హెడ్‌మాస్టరు.

గాలి వాన ఉధృతం అంత కంతకు ఎక్కువవుతోంది. రోడ్లమీద నీటిమట్టం పెరుగుతోంది. అంతకంతకు రోడ్లెక్కడున్నాయో అని వెతుక్కోవలసిన పని పడుతోంది. ఊరు వూరంతా ఒకటే గగ్గోలుగా వుంది. పట్నం పోవడానికి ఎవరికివాళ్ళు తొందరపడిపోతు



న్నాయా

'ఇంట్లో యెంకటేశు లేడు...' అంది అచ్చి.

'వుంటాడులే యెక్కడికి పోతాడు ? ఆడే వత్తాడు...' అన్నాడు మొండి ధైర్యంతో నర్సిగాడు గుడ్డల మూటలో పొగాకుకట్ట వేసుకుంటూ.

లోలోపల గుబులుగావున్నా ప్రయాణం హడావిడిలో ఆ కాస్సేపూ యెంకటేశుని మరచిపోయింది అచ్చి.

ఊరు వూరంతా బారులుగా నీటి కాలువల్లావున్న రోడ్లమీద సామాన్లతో నడిచిపోతున్నారు

పిడుగులూ, పెడబొబ్బలూ మిన్ను ముట్టుతున్నాయి. తమ తమ పూరిపాకలు నేల మట్టమై నీళ్లల్లో తేలిపోవడం కళ్లారా చూస్తున్న ఆ జనం పడుతున్న బాధ హృదయవిదారకంగా వుంది.

* * *

యెంకటేశు హెడ్మాస్టారి భయంతోను, అమ్మా బాబుల భయంతోను ఎటూ తోచక బడి కాంపవుండుదాకా పరుగెత్తుకొచ్చాడు.

ఒకసారి వెనుతిరిగి చూసి తనని అనుస

# చదువు

రిస్తున్నవాళ్లు ఎవళ్లూ లేరని నిశ్చయించుకున్నాక కొంచెం ధైర్యం తెచ్చుకున్నాడు.

తర్వాత కనిపించింది.

నిర్మానుష్యమైన బడిగేటు. అప్పటికే లోపలికి నీరు ప్రవహించింది. ఆ ప్రవాహవేగానికి తెరచివున్న తలుపులు వెనక్కీ ముందుకీ వూగుతున్నాయి.

అవి తనని లోపలికి ఆహ్వానిస్తున్నట్టుగా భావించాడు యెంకటేశు.

'బడి కూడా అమ్మలాంటిదే ..'

అన్న పంతులుగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి. అంతులేని ధైర్యమొచ్చింది. జనసంచారం కూడా లేకపోవడంతోనూ, తనని అడ్డుపెట్టేవాళ్లు ఇపుడు లేరనే సంతోషంతోనూ లోపలికి వెళ్లిపోయాడు. ఇష్టారాజ్యంగా అంతా కలియ తిరిగేశాడు.

తనే బడి పిల్లాడుగాను, తనే మాస్టారిగాను, తనే హెడ్మాస్టారుగాను, తనే గేటుని కాపలా కాసే మీసాలసామీ లాగాను స్వేచ్ఛగా విహరించాడు. తెరచి వున్న గదులన్నింటిలోనూ తనివితీరా పచార్లు చేశాడు. అసలైన స్కూలు పిల్లాడిలా ఠీవిగా తిరిగాడు.

అమ్మదగ్గరున్నప్పటి కంటే ఇప్పుడే, బడిలో వున్నప్పుడే తనకి ఎక్కువ సంతోషంగా వుంది. ఆకలిదప్పుల్ని కూడా మరిచి పోగల్గాడు.

'అవును బడి అమ్మకంటే గొప్పది'

అనుకున్నాడు మళ్లీ ఒకసారి మనసారా.


అమ్మ వొడి ఎంత వెచ్చగా వుంటుందో—ఎంత హాయిగా వుంటుందో యెంకటేశుకి తెలియదు. కాని పాఠశాల వడి మాత్రం — అంతటి భీకర వాతావరణంలోనూ వాడికి ఎంతో హాయి కూర్చింది.

అంతక్రితం తను చూసిన గదిలోకి వెళ్లాడు. అక్కడ బెంచీలన్నీ పిల్లల్లేక దిగాలుపడి వున్నట్టనిపించాయి?

ఉత్సాహంగా వెళ్లి ఒక బెంచీమీద కూర్చోగానే వాళ్లంతా తేలిపోయినట్టనిపించింది. ఎన్నడూలేని ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. కాని అనుభవించే వోపిక మాత్రం యెంకటేశు వొంట్లో లేదు. మగతగా వుంది. కళ్లు మూసుకుపోతున్నాయి. ఎదురుగా వున్న డెస్కు మీదకి వొరిగి పోయాడు.

పంతులుగారు పాఠం చెబుతున్నట్టు, తనూ విద్యార్థులతో కలిసి చదువుకుంటున్నట్టు తియ్యని కల వచ్చింది. పంతులుగారు పాఠం చెబుతూ, చెబుతూ మధ్యలో ప్రశ్నలు వేస్తున్నారు. తను చకచకా సమాధానాలు చెప్పేస్తున్నాడు. పంతులుగారు ఎంతో మెచ్చుకుంటున్నారు. పరీక్షలు పాసు చేసేస్తున్నారు. తను అంతకంతకు పెద్ద పెద్ద చదువులు చదివేస్తున్నాడు.

తను ? పూర్తిగా మారిపోయాడు. అందరి పిల్లలకంటె తెల్లనిబట్ట లేసుకుంటున్నాడు. పుస్తకాలసంచీ భుజానికి



తగిలించుకుని అందరి పిల్లల్తోపాటు ఆడుతూ పాడుతూ రోజూ బళ్ళోకి వెళ్తున్నాడు. తను చదువుకుంటున్నాడు

'నేను చదువుకుంటున్నాను ...

నేను చదువుకుంటున్నాను ...

నేను చదువుకుంటున్నాను...'

అని కలవరిస్తుండగా వాడికాళ్ళకిందకి నీళ్ళువచ్చి మెలుకువ రప్పించాయి.

కళ్ళు నులుముకు చూశాడు.

అంతా కల!

క్రిందన్నీ నీళ్ళు. నీళ్ళు బడిలోపలికంటూ వచ్చేస్తున్నాయి.

లేచాడు. వెంటనే వరండాలో కొచ్చి చూశాడు. చుట్టూ గంగాప్రవాహంలా వుంది.

ఆ నీళ్ళుచూసి యెంకటేశు భయపడలేదు. ఎక్కడలేని వుత్సాహం వచ్చేసింది. కాళ్ళతో నీళ్ళని ఈదుకుంటూ గంతులు వేయసాగాడు...కేరింతలు కొట్టసాగాడు.

హఠాత్తుగా దభిల్లుమన్న శబ్దం వినిపించింది. ఆ శబ్దానికి భూమంతా అదిరినట్టయింది. స్తంభాన్ని గట్టిగా కావలించుకున్నాడు కళ్ళు మూసుకుని తెరిచేంతలో బడి ఒకప్రక్క వారిగిపోయింది.

బడి కూలిపోతోంది!

అంటే! ఇక్కడికి పిల్లలు రారన్నమాట! పంతుళ్ళూరారు! మరి చదువుకునేదెలా? ఇప్పుడు యెంకటేశుకి ఎక్కడలేని భయం పుట్టుకొచ్చింది

'కూలిపోకూడదు, బడి కూలిపోకూడదు...'

అనుకుంటూ ఆ స్తంభాన్నే మరింత గట్టిగా పట్టుకున్నాడు.

వానకు తడిసిన పెండెం కొంచెం కిందికి దిగజారింది. దాంతోపాటు దానికి కట్టిన గంట గణగణలాడింది గంటని చూశాడు యెంకటేశు గంట చేతికందేలా వుంది.

మెరిసిన మెరుపుకు లోకమంతా తెల్లవయింది. అలాంటి ఆలోచనే యెంకటేశుకి స్ఫురించింది!

గంటకొడితే వూళ్ళో జనమంతా వస్తారు. వచ్చి బడిని కాపాడతారు! బడి అమ్మని రక్షిస్తారు!

బడి పడిపోకూడదు!

బళ్ళో పిల్లలు చదువుకోవాలి!

—అనుకుంటూ గంటని అదేపనిగా మోగించడం మొదలుపెట్టాడు.

యెంకటేశు కోసం వెదికి వెదికి నిరాశ చేసుకుని గంపెడు దుఃఖంతో నీటిలో ఈదుకుంటూ వెళ్తున్న నర్సిగాడికి బడి గంట వినిపించింది.

'యెంకా...! యెంకటేశా...!!

అని గట్టిగా అరిచాడు.

గొంతు పెగుల్చుకుని అరిచాడు.

అతని అరుపులు బడి గంటల్లో కలిసిపోతున్నాయి.

ప్రవాహానికి ఎదురీదుతూ బడిని చేరుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు నర్సిగాడు. ఎంతో శ్రమపడి గేటుదాకా రాగల్గాడు. వడిగా సుళ్ళు తిరుగుతూ వస్తున్న ప్రవాహం నర్సిగాడిని విసిరికొట్టింది. నర్సిగాడు అమడ దూరం కొట్టుకు పోయాడు.

ఎదురీత ఈదే నర్సిగాడికి గంటలు నెమ్మది నెమ్మదిగా వినిపిస్తున్నాయి. నర్సిగాడు చూస్తుండగానే అంతా అయిపోయింది. బడి పూర్తిగా కూలిపోతున్న భయంకర దృశ్యం అతని కంటబడింది. కూలినేల మట్టమై నీటిలో తేలిపోవడం కళ్ళారా చూశాడు.

గంటలు ఆగిపోయాయి...కాని, శబ్దం వినిపిస్తూనే వుంది. నర్సిగాడి చెవుల్లో గింగురుమంటూనే వుంది. 'చదువో చదువో' అని గగ్గోలపెడుతున్న ఆ శబ్దం నర్సిగాడ్ని పిచ్చివాడ్ని చేస్తోంది.

ఫెళఫెళా పురుములు!

తళతళా మెరుపులు!

ఆ కాంతిలో నర్సిగాడి కళ్ళు చూడలేక పోయాయి. అంత పెద్ద కాంతిని నర్సిగాడికున్న చిన్న కనురంధ్రాలేమి చూడగల్గుతాయి?

కళ్ళు చూడలేని ఆ కాంతి ఎందుకు? కాల్చనా? ●

